# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 06-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.**

**2.** **చిత్తూరులో 'స్వర్ణ కుప్పం-విజన్ 2029' డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు విడుదల చేశారు.**

**3.** **దేశ పారిశ్రామికాభివృద్ధిలో రతన్ టాటా కీలక పాత్ర పోషించారని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలో అపరిష్కృత దరఖాస్తుల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ప్రత్యేక డ్రైవ్ ని నిర్వహిస్తోంది.**

**5.** **విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా ఈ రోజు సాయంత్రం పుస్తక ప్రియుల పాదయాత్రను నిర్వహిస్తారు.**

==========================

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా జమ్మూ రైల్వే డివిజన్ ప్రారంభించి, వివిధ రైల్వే ప్రాజెక్టులకు ఈ రోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జమ్మూ రైల్వే డివిజన్ ఏర్పాటు ద్వారా జమ్మూ కాశ్మీర్, చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రయోజనం చేకూరడంతో పాటు రవాణా సౌకర్యాలు మరింత అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఈ ప్రాంతాల్లో కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడడంతో పాటు.. పర్యాటకానికి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.

అలాగే తెలంగాణ హైదరాబాద్ సమీపంలోని చర్లపల్లి కొత్త టెర్మినల్ స్టేషన్ను కూడా ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో 'స్వర్ణ కుప్పం-విజన్ 2029' డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా చర్యలు

తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో కుప్పం అభివృద్ధికి చేపట్టనున్న ప్రణాళికలను విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

---------------------------

దేశ పారిశ్రామికాభివృద్ధిలో రతన్ టాటా కీలక పాత్ర పోషించారని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి ఈరోజు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం కాళ్ల మండలం పెద ఆమిరం జువ్వలపాలెంలో రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రావాలని మంత్రి కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ-ఏపీ రెరాలో అపరిష్కృత దరఖాస్తుల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ప్రత్యేక డ్రైవ్‌ని నిర్వహిస్తోంది. విజయవాడలోని ఏపీ రెరా కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికారులతో పాటు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను గురించి దరఖాస్తుదారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. జగ్గయ్యపేటలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే 65వ నెంబర్ జాతీయ రహదారిపై తోటచర్ల నుంచి గరికపాడు వరకు 17 జంక్షన్‌లలో ప్రమాద హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేశామని చెప్పారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాల డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలుపుతూ,

వాయిస్ .. 34 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 17వ తేదీన రెండోసారి మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 2వ తేదీన తొలిసారి మంత్రివర్గ సమావేశం జరిగింది. కాగా రెండోసారి మంత్రివర్గ సమావేశం 17వ తేదీన ఉదయం 11 గంటలకు రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ఈ సమావేశంలో చర్చించేందుకు 16వ తేదీ నాటికి ఆయా శాఖలు ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు.

---------------------------

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ లో జరగనున్న మహా కుంభమేళా 2025 సందర్భంగా వచ్చే యాత్రికుల సౌకర్యార్థం 13 వేల రైళ్లను నడపనున్నామని భారతీయ రైల్వే వెల్లడించింది. వీటిలో 10 వేల రెగ్యులర్ రైళ్లు, 3 వేల ప్రత్యేక రైళ్లు ఉన్నాయి. ఈ రైళ్లు 50 రోజుల పాటు నడవనున్నాయి. ఈ రైళ్ళు కుంభమేళా ముందు, తరువాత 2 నుండి 3 రోజులు అదనంగా ఉంటాయని ఉత్తర మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శశికాంత్ త్రిపాఠి తెలిపారు. లక్షలాది మంది భక్తులు, సందర్శకులకు సమాచార, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, రైల్వే అధికారులు కలిసి పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ప్రయాగ్ రాజ్‌లోని గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం వద్ద మహా కుంభమేళా జరగనుంది.

---------------------------

విజయవాడలోని ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవం 5వ రోజు కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు సాయంత్రం పుస్తక ప్రియుల పాదయాత్రను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ హాజరై పాదయాత్రను ప్రారంభించనున్నారు. ఈ యాత్ర మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల నుంచి ప్రారంభమై ఇందిరాగాంధీ క్రీడా మైదానం వరకు జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

---------------------------

పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధమయ్యే విధంగా నూరు రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామని తిరుపతి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు తెలిపారు. శ్రీకాళహస్తిలోని జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల పరీక్షల సన్నహాలను ఆయన ఈరోజు పరిశీలించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తున్నామని ప్రభాకర్ రాజు పేర్కొంటూ...

వాయిస్ .. 31 సెకన్లు

---------------------------

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రేపు పాలకొండలో మినీ ఉద్యోగ మేళా జరగనుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధికల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో 18 నుంచి 32 ఏళ్ల వయసు గల యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. పాలకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఉద్యోగ మేళా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

---------------------------

విజయవాడలో ఈరోజు నుంచి ఈ నెల 10వ తేదీ వరకు జాతీయ వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నామని రాష్ట్ర పాఠశాల క్రీడా కార్యదర్శి జి భానుమూర్తి రాజు వెల్లడించారు. ఈ క్రీడా పోటీల గురించి విజయవాడలో ఆయన పాత్రికేయులకు వివరించారు.భారత పాఠశాల క్రీడల సమాఖ్య నిర్వహించే 68వ జాతీయ వాలీబాల్ టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొంటున్నాయని భానుమూర్తి తెలియాజేస్తూ,

వాయిస్ ..36 సెకన్లు

---------------------------

ప్రపంచ యుద్ధ అనాథల దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు. యుద్ధాల వల్ల అనాథలైన పిల్లల మానవ హక్కులను రక్షించాల్సిన అవసరం గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడం, వారికి మంచి భవిష్యత్తును రూపొందించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్య ఉద్దేశ్యం. యుద్ధ అనాథల దుస్థితి గురించి అవగాహన కల్పించడానికి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సంవత్సరం జనవరి 6వ తేదీన ఈ దినాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం “అనాథల జీవితాలు ముఖ్యమే” అనే ఇతివృత్తంతో ప్రపంచ యుద్ధ అనాథల దినాన్ని జరుపుకుంటున్నారు.

=====================